శరవేగంగా సమగ్ర సర్వే..

- గ్రామాల్లో 89.36 శాతం, పట్టణాల్లో 77.29 శాతం
- జిల్లా వ్యాప్తంగా 85.09 శాతం పూర్తి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో వేగంగా జరుగుతున్నది. గడిచిన పదకొండు రోజుల్లో 85.09 శాతం సర్వే పూరి ్కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 89.36 శాతం, పట్టణ ప్రాంతాల్లో 77.29 శాతం సర్వే పూర్తయ్యింది. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతున్నది. గ్రామాల్లో కుటుంబాల గుర్తింపు కూడా త్వరగా పూర్తయ్యింది. పట్టణ ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకుని ఉన్న వారితో పాటు అద్దె భవనాల్లో ఉంటున్న కుటుంబాలను గుర్తించడంలో అధికార యంత్రాంగం ఇబ్బందులకు గురయ్యింది. సర్వే కూడా పట్టణాల్లో ఇంటి యజమానులు అందుబాటులో లేక కొన్త జాప్యం అవుతున్నది. సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరిస్తుండడంతో జిల్లాలో వేగంగా జరుగుతున్నది. జిల్లాలో 2,54,828 కుటుంబాలను గుర్తించారు. గ్రామీణప్రాంతాల్లో 1,64,363 కుటుంబాలు, పట్టణ ప్రాంతాల్లో 90,465 కుటుంబాలున్నట్లు గుర్తించారు. మంగళవారం నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 1,46,887 కుటుంబాలు, పట్టణప్రాంతాల్లో 89,921కుటుంబాల

మిగతా 8వ పేజీలో


ఎలిగేడు మండలంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష(ఫైల్)

● నాలుగైదు రోజుల్లో పూర్తి..

వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, ఉపాధి పనుల దృష్ట్యా పట్టణ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో ఉంటున్న చాలా మంది తమ స్వగ్రామంలోనే సర్వేకు వెళుతున్నారు. అక్కడికి వెళ్లి వివరాలను వెల్లడిస్తున్నారు. దాదాపు 56 శాతం గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది. ప్రభుత్వం సర్వే చేసేందుకు ఒక్కో ఎన్యూమరేటర్‌కు 15 రోజుల గడువు ఇచ్చింది. రోజుకు 10 కుటుంబాల సర్వే పూర్తి చేయాలని పేర్కొంది. మొదటి రెండు, మూడు రోజులు ఒక్కో కుటంబ సర్వే నిర్వహించేందుకు 30 నుంచి 45 నిమిషాల సమయం పట్టినప్పటికీ, ఆ తర్వాత సిబ్బందికి వివరాలు నమోదు చేయడం ఈజీ అయ్యింది. సర్వే చేసిన ఫారాలను ఎంపీడీఓ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారు. జిల్లాలో నిర్దేశించిన గడువు 15 రోజుల్లోనే వందకు వంద శాతం సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి. సర్వే సందర్భంగా ఎక్కడ కూడా జిల్లాలో నిరసనలు తెలిపిన సందర్భాలు కానరాలేదు. ఎక్కడ కూడా ఏ ఇబ్బందులు లేకుండా సర్వే సాఫీగా సాగుతున్నదని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సర్వే చేసిన వివరాలను కుటుంబాల వారీగా నమోదు చేసేందుకు తాత్కాలికంగా నియమించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇస్తున్న శిక్షణ మంగళవారం పూర్తయ్యింది. సర్వే పూర్తయిన వెంటనే ప్రభుత్వం రూపొందించిన సమగ్ర ఇంటింటి కుటుంబ యాప్‌లో కంప్యూటర్ ఆపరేటర్లు నమోదు చేయనున్నారని అధికారులు తెలుపుతున్నారు. మొత్తంమీద జిల్లాలో నాలుగైదు రోజుల్లో సర్వే పూర్తి కానున్నది.

అభ్యాసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఆయన పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించి చదవడం, రాయడం, చదివింది అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలు ఉండేలా కృషి చేయాలన్నారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు బేరీజు వేస్తూ డిసెంబర్ నెలలో నిర్వహించే టెస్ట్‌లో వారి ఓరల్ రీడింగ్ ఫ్రీక్వెన్సీ, రీడింగ్ కంప్రెషన్ పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష


ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్

దేశంలో పేదరికాన్ని రూపుమాపిన ఇందిరాగాంధీ

- రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్

8


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వేణు

8

జిల్లాలో 1503 మంది రైతులకు రూ.5.91కోట్ల బోనస్

పెద్దపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 1503 మంది రైతుల నుంచి లక్షా 18 వేల 260 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి 5 కోట్ల 91 లక్షల 30 వేలయ 600 రూపాయల బోనస్ చెల్లించామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సన్న రకం ధాన్యం ప్రత్యేకంగా కొనుగోలు చేస్తున్నామని, ప్రతి క్వింటాల్ సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని, నవంబర్ 14 నుంచి 18 వరకు మొత్తం 1503 రైతుల నుంచి లక్షా 18 వేల 260 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి 5 కోట్ల 91 లక్షల 30 వేల 600 రూపాయల బోనస్ చెల్లించామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

23న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు పెద్దపల్లి, చొప్పదండిలోని కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్స్‌లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 23న శనివారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్లో రూమ్ నంబర్ 225లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన్ ఫర్టిలైజర్స్ సంస్థలో 40 సేల్స్ ఎగ్జిక్యూటివ్, 4 ఫీల్డ్ డెవలప్మెంట్ అధికారులు, 2 హెచ్‌ఆర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్, ఫీల్డ్ డెవలప్మెంట్ అధికారులకు బీఎస్సీ అగ్రికల్చర్, హెచ్‌ఆర్ పోస్టుకు ఎంబీఏ తరగతి ఉత్తీర్ణులు అర్హులని తెలిపారు. ఈనెల 23న ఉదయం 11 గంటలకు సర్టిఫికేట్స్ జిరాక్స్‌లతో కలెక్టరేట్‌కు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9908674056, 8985336947, 81211262441 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

డీఎంహెచ్‌వో సమీక్షా సమావేశం

పెద్దపల్లిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లాలో జరిగిన మాతృ మరణాలపై డాక్టర్ జి ప్రసన్న కుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగిన నాలుగు మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించి, గ్యాప్స్‌ను గుర్తించి, మాతృ మరణాలను తగ్గించుటకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీధర్ డిసిహెచ్ ఎస్, డాక్టర్ బి వాణిశ్రీ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంహెచ్‌ఎన్, డాక్టర్ సదానందం సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రమణ అనస్థీషియన్, డాక్టర్ స్రవంతి గైనకాలజిస్ట్ , డాక్టర్ శ్రీరామ్ డిప్యూటీ డిఎంహెచ్‌ఓ, డాక్టర్ కిరణ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సిహెచ్ అండ్‌ఐ, సంబంధిత వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఖని బస్ డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీలో కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని, కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఖని బస్ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమార స్వామి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌టీసీ కార్మికుల ఐక్యతను దెబ్బతీయడానికి కార్మిక సంఘాలను రద్దుచేశారని, కార్మికులు ప్రశ్నించకుండా ఉండటానికే ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆరోపించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని డిపో మేనేజర్ నుంచి పై అధికారుల వరకు కార్మికులపై పని గంటలు, పని భారం మోపుతున్నారని ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా ఒక్క రోజు సెలవు కూడా ఇవ్వడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్‌టీసీలో యూనియన్ కార్యకలాపాలకు అనుమతిస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా ఇంత వరకు అమలు చేయడం లేదన్నారు. ఈ ధర్నాలో నర్సయ్య, నరహరి, రంగయ్య, శివకుమార్, గణేష్, బాలకృష్ణ, సంపత్, దీప, మహేశ్వరి, అంజలి, మంజుర, రమ, వరలక్ష్మి, జమున, నర్సమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి నిత్యాన్నదానం

కోల్‌సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్ప దేవాలయంలో ఈనెల 20వ తేది నుంచి నిత్యాన్నదానం(భిక్ష) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన కమిటీ అధ్యక్షుడు బయ్యపు ప్రభజంన్‌రెడ్డి పేర్కొన్నారు. జనవరి 14వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దాతలు సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మైక్ సెట్ వితరణ

ఓదెల, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం పల్లె ధనలక్ష్మి మైక్‌సెట్‌ను వితరణ చేశారు. నాగపూరి రవిగౌడ్, ముంజాల మహేందర్‌గౌడ్, ఐలు స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

ముత్తారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని మచ్చుపేట, ఖైదం బండ, ముత్తారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన రైతులతో ఎన్ని ఎకరాలలో పంట సాగు చేశారు, ఎంత దిగుమతి వచ్చింది, కొనుగోలు కేంద్రాలకు పంట తెచ్చి ఎన్ని రోజులు అవుతుంది, తేమ శాతం ఎంత ఉంది, టార్పాలిన్ కవర్లు ఇస్తున్నారా మొదలగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో సన్న రకం ధాన్యం కొనుగోలు రిజిస్టర్‌లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని అన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉంటూ పంటకు టార్పాలిన్ కవర్లు కప్పాలని కలెక్టర్ తెలిపారు. 17 శాతం తేమ రాగానే వడ్లకు కాంటా వేయాలని, కోనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్వింటాళ్లకు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఇది ప్రత్యేకంగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం అమ్మే సమయంలో రైతులు సమర్పించిన బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతున్నాయన్నారు. మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ ముత్తారంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారితో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. అన్ని సౌకర్యాలు బాగా ఉన్నాయని అన్నారు. పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్ వద్ద నీరు నిల్వ ఉండకుండా సైడ్‌డ్రెయిన్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. వెంట జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, ఎంపీడీవో సురేష్, డిప్యూటీ తహసీల్దార్ షఫీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురు పంచాయతీరాజ్ సిబ్బంది సస్పెన్షన్

ముత్తారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పనిచేసే ఆరుగురు పంచాయతీరాజ్ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం ముత్తారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఉదయం 11:30 గంటలకు తనిఖీ నిర్వహించిన కలెక్టర్ సిబ్బంది విధులకు గైర్హజరవడం గమనించారు. బయోమె ట్రిక్ అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలించగా ఆ సిబ్బంది అనుమతి లేకుండా చాలా రోజులుగా విధులకు డుమ్మా కొట్టడం గమనించిన కలెక్టర్, పలు మార్లు ఆ సిబ్బందికి మెమోలు జారీ చేసినప్పటికీ విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ సస్పెండ్ చేశారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎండి.ఖాదర్ పాషా, జూనియర్ అసిస్టెంట్ వి.నరేష్, సబార్డినేట్ ఎండి ఫయాజ్, సిబ్బందిగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సురేందర్, ఫయాజ్, జైపాల్‌లను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

రంగోళి పోటీలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళ వారం రంగోళి, మెహందీ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న అన్నయ్యగౌడ్, స్వరూప, తదితరులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మున్సిపల్ పరిధిలో 3, 10, 22వ వార్డులల్లో మంగళవారం టీయూఎఫ్ ఐడీసీ నిధులు కోటి 32 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటానని, పట్టణంలో దశలవారీగా సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, మాజీ ఎంపీపీ గోపగాని సరయ్యగౌడ్, సందవేణి రాజేందర్, సయ్యద్ మస్రత్, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కుట్రపై విచారణ జరపండి..

మంథని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తనను హత్య చేసేందకు కట్రు జరిగినట్లు కాటారం మాజీ జడ్పీటీసీ, బీజేపీ నేత చల్లా నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం మంథని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 17న చల్లా నారాయణరెడ్డి ఒక వీడియో విడుదల చేశాడని, అందులో తనను హత్య చేసేందకు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబులు కుట్ర చేశారని పేర్కొరన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు పుట్ట మధు ఫిర్యాదు కాపీని బీఆర్‌ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, బంజర్ల శేఖర్, కాయితీ సమ్మయ్య, కనవేన శ్రీనివాస్, లోదారి రాములు, ఆసీఫ్,వేల్పుల గట్టయ్య మంథని లక్ష్మణ్‌లు మంథని పోలీసు స్టేషన్‌లో అందజేశారు.

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. సంకట హర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ అవరణ భక్తులతో సందడిగా మారింది.

ఏసీబీ వలలో అంతర్గాం తహసీల్దార్

డబ్బులు పడేసి పారిపోయిన ఆర్‌ఐ



తహసీల్దార్ ఉయ్యాల రమేష్, బాధితుడు ఆలకుంట మహేష్

అంతర్గాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్గాం తహసీల్దార్ ఉయ్యాల రమేష్‌తో పాటు ఆర్‌ఐ ఎగ్గిడి శ్రీధర్‌లు ట్రాక్టర్ ఓనర్ వద్ద రూ.12వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు, బాధితుడు ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 28న మండల పరిధిలోని లింగాపూర్ గోదావరినది సమీపంలో ట్రాక్టర్‌ను అంతర్గాం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్‌ను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. జరిమానా రూ.50 వేలు చెల్లించాలంటూ తహసీల్దార్ రమేష్ చెప్పారు. తాను పేదవాడినని అన్ని డబ్బులు చెల్లించలేనని బాధితుడు మహేష్ వేడుకోగా సంబంధిత ఆర్‌ఐ శ్రీధర్‌ను కలవమని తహసీల్దార్ సూచించారు. దీంతో బాధితుడు ఆర్‌ఐని కలువగా రూ.12 వేలు డీడీ తీసి ఇవ్వడంతో పాటు మరో రూ.12వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు బాధితుడు రూ12వేల డీడీతోపాటు రూ.12వేల నగదును ఆర్‌ఐ శ్రీధర్‌కు ఇవ్వగా, ఆయన డబ్బులతో తహసీల్దార్ చాంబర్‌కు వెళ్లాడు. వెంటనే ఆఫీస్‌లోకి వచ్చిన ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్, ఆర్‌ఐ శ్రీధర్‌లను పట్టుకునేందుకు ప్రయత్నించగా డబ్బులు ఆఫీస్ బయట పడవేసిన ఆర్‌ఐ శ్రీధర్ తప్పించుకొని పరారయ్యాడు. దీంతో ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు బాధితుడితో మాట్లాడిన తహసీల్దార్ రమేష్, ఆర్‌ఐ శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. దాడులలో ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణ కుమార్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

బద్దిపోచమ్మకు

బోనాల మొక్కులు

డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపు



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు బోనాల మొక్కులు చెల్లిం చుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున అమ్మవారికి నైవేద్యాన్ని ఏర్పాటు చేసుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. బద్దిపోచమ్మకు పట్నాలు వేసి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి కల్లు సాక పెట్టి పిల్లాపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.



బోనాలతో బారులు తీరిన భక్తులు

ఉద్యోగులపై దాడిని ఖండిస్తున్నాం

ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో ఆయన మాట్లాడుతూ అమాయక ప్రజలను రెచ్చగొడుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి అమలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆ ప్రభుత్వం ఆదేశాలను ఉద్యోగులు పాటిస్తారన్నారు. తమ స్వంత ఆలోచనలు గాని, స్వంత ఎజెండా గాని ప్రభుత్వ ఉద్యోగులకు ఉండదని ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, నాగులు నరసింహస్వామి, హరికృష్ణ, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, గంగారపు రమేశ్, మహిళ ఉద్యోగుల ప్రతినిధులు శారద, సునీత, విజయలక్ష్మి, శైలజ, సర్దార్ హర్మిందర్‌సింగ్, జలాలుద్దీన్‌అక్బర్, గుంటి బిక్షపతి, అభిషేక్‌రెడ్డి, శంకర్, మన్మిత్‌సింగ్, హస్గర్ శ్రీనివాస్, కమలాకర్, నాల్గవ తర గతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు కోట రామస్వామి, శంకరయ్య, రాజేశ్వర్‌రావు, ఎల్లె శీను, వంశీ, బోనాల రవి, అజయ్, నారాయణ, వివిద ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు

శంకరపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల బీచ్‌వాలీబాల్ ఎంపిక పోటీలను ఎంఈవో లక్ష్మీనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈపోటీల్లో వివిధ పాఠశాల నుంచి వచ్చిన వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాష్, పెట రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీను, మోడల్ స్కూల్ ప్రెసిడెంట్ అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం వెలికితీత

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండబత్తిని రాజేశ్వరి(65) సోమవారం బావిలో దూకగా, రెండు రోజుల పాటు గాలించిన పోలీసులు గ్రామస్థుల సహాయంతో మంగళవారం మృతదేహన్ని బయటికి తీశారు. రాజేశ్వరి భర్త రాజాకిషన్ 14సంవత్సరాల నుంచి పక్షవాతంతో బాధ పడుతున్నారు. భర్త పరిస్థితిని చూసి మనోవేదనకు గురైన రాజేశ్వరి బావిలో దూకి ఆత్మహత్యకు చేసుకుంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేశ్వరి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బీర్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్వాయి గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన సల్ల గంగన్న ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయింది. బాధి తులు గంగన్న కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదంలో 65వేల నగ దు, ముప్పావు తులంబంగారం, 25 తులాల వెండి పూర్తిగా కాలిపోయిందని విలపించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని ప్ర మాద నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు నివేదించారు.

ఒకరిపై కేసు నమోదు

చొప్పదండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 15న గాలిపెల్లి కనకయ్యకు చెందిన వస్త్ర దుకాణాన్ని పెట్రోల్‌పోసి నిప్పంటించిన కోడూరి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ అనూష మంగళవారం తెలిపారు. వస్త్ర దుకాణంలో మంటలు వ్యాపించగా ఆరులక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు వ్యాపారి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేస్తాం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో రైతులను విత్తన కంపెనీల నుంచి మోసాలకు గురికాకుండా విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేసే విధం గా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్య క్షుడు అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీ కృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విత్తన చట్టంలో ఉన్న లొసుగుల వల్ల ప్రైవేటు కంపెనీలకు అనుకూలంగా ఉన్న పరిస్థితులున్నాయన్నారు. ప్రైవేటు కంపెనీల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ విత్తన సంస్థ అందించే మేలు అయిన రకాల విత్తనాలను వినియోగించాలని రైతులను కోరారు. వివిధ రకాల ప్రైవేటు కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. రకరకాల ఆకర్షణీయమైన ప్రకటనలతో ఆకర్షించి సొంత వెరైటీ విత్తనాలను రైతులకు విక్రయించి ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రైవేటు విత్తనాల వల్ల రైతులు పంట నష్టపోతే పరిహారం అందించడం లేదన్నారు. కేవలం విత్తన పెట్టుబడులను మాత్రమే అందిస్తున్నారన్నారు. పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే యోచన చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు రకరకాల ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

రాష్ట్రంలో రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళ వారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సంఘాల కార్య దర్శులు, వ్యవసాయ అధికారులతో యా సంగి 2024-25 పంట సీజన్ సందర్భంగా ప్రత్యే క సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యక్రమా లను మరింత ముమ్మరం చేస్తామన్నారు. నా ణ్యమైన విత్తనాలు అందించే విత్తనాభివృద్ధి సం స్థను సహకార సంఘాలు ప్రోత్సహించాలన్నా రు. జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీసీఎం ఎస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ బాధ్యులు, పాల్గొన్న పెన్షనర్లు

సుభాష్‌నగర్, నవబంరు 19(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పీఆర్‌సీని 2023 జూలై నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.15వేలు ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో రెండు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందించాలని కోరారు. గ్యాడ్యుటీని కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రూ. 20లక్షలు చెల్లించాలని కోరారు. పెన్షనర్లు కూడా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కట్ట నాగ భూషణాచారి, కోశాధికారి ఇరువంటి తిరుమలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బొంగోని వెంకటయ్య, గరిగ చంద్రయ్య, నల్ల ప్రభాకర్‌రెడ్డి, రాయికంటి రామకృష్ణయ్య ఆర్‌టీసీమల్లయ్య చొల్లేటి మాల్లరెడ్డి, అరికాల చంద్రమౌళి, తాటిపాముల కనకయ్య, ఎస్ సారభద్రస్వామి, బి జగదీశ్వర్, కొండా రాజయ్య, ఎం గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఊకంటి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న పలువురి అరెస్టు

వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి



ఎస్‌ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల

మెట్‌పల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని మెట్‌పల్లిసీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం బండలింగపూర్ క్రాస్ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బండలింగపూర్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా బైక్‌లో నల్లని కవరులో తీసు కెళ్తున్న గంజాయిని పట్టుకున్నాట్లు తెలిపారు.

వారి వద్ద నుండి 220 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. గంజాయి తర లిస్తున్న మెట్‌పల్లికి చెందిన లోకిని వంశీ, కోయిల్కర్ రమేష్, లోకిని విగ్నేష్‌లను విచారించగా నిజామాబాద్ రైలులో నాందెడుకు వెళ్లి గతంలో పరిచయం ఉన్న అజార్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయి కొనుగోలు చేసి అక్కడి నుండి మెట్‌పల్లికి కొను గోలు చేసిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి 500 చొప్పున అమ్మేందుకు వస్తుండగా పట్టుకున్నాట్లు తెలిపారు. ముగ్గురు నిందితు లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బైకు 3 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకోని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్, పోలీస్ సిబ్బంది సాదు నాయక్, సంతోష్‌లు ఉన్నారు.

● **ఐదుగురు నిందితుల అరెస్టు**

కరీంనగర్ క్రైం, (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ వద్ద మంగళవారం కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించగా ఐదుగురు నిందితుల వద్ద కిలో 98 గ్రాముల గంజాయి పట్టుబడింది.

కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం మొగ్దుంపూర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి బైక్‌లను అక్కడే వదిలిపెట్టి పారిపోయే ప్రయత్నం చేయగా వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా నిషేధిత గంజాయి పట్టుబడింది. అనంతరం వారిని విచారించగా మహారాష్ట్రలోని బల్లార్షలో కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు వెల్లడైంది. పట్టుబడిన నిందితులు కుందనపల్లికి చెందిన మేకల మహేందర్(22), తొర్తి శశికుమార్(24), ఫకీర్‌పేట్ గ్రామానికి చెందిన కడప వంశీ(19), ఎండీ సాధాకత్ అలీ(20), నగునూర్‌కు చెందిన గద్దల శ్రీరాం(19)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జడ్జి ఆదేశాల మేరకు జైలులో రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

నిధులు మంజూరై రెండేళ్లు

● **పనులు ప్రారంభానికి ఎన్నేళ్లో** ● **లోలెవల్ కల్వర్టుతో ప్రయాణికులకు ఇక్కట్లు**



లో లెవల్ కల్వర్టు

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది పెగడపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని లోలెవల్ కల్వర్టు పరిస్థితి. నిధులు మంజూరై రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభానికి మాత్రం మోక్షం లభించడం లేదు. పెగడపల్లి మండల కేంద్రం నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే రోడ్డులో సబ్‌స్టేషన్ సమీపంలో లో లెవల్ బ్రిడ్జితో వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది దీంతో పాటు కల్వర్టు సైతం శిథిలా వస్థకు చేరుకోగా గత ప్రభుత్వం హయాంలోనే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గాను రూ. రెండు న్నర కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది. నిధులు మంజూరు, టెండరు పూర్తయినా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఆ రోడ్డు ద్వారా ప్రయాణించే ప్రయాణికులు కల్వర్టు దాటే వరకు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జోక్యం చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆవుపై అడవి జంతువు దాడి

సైదాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు బాసవేని కుమార్‌కు చెందిన ఆవుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసి గాయపరిచింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసే సరికి ఆవు మెడ కింది ముందు కాలు వద్ద పెద్ద గాయమయ్యి ఉందని తెలిపాడు. వెంటనే పశువైద్యులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి ట్రీట్‌మెంట్ చేశారన్నారు. ఆవుపై దాడి చేసింది హైనా అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసినట్లు పేర్కొన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఇసుకను తరలిస్తున్న బద్దం రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు



పట్టర్లు లేకుండా మిగిలిపోయిన తూములు

● **పట్టించుకోని అధికారులు**

● **ఆందోళనలో రైతులు**

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాలువల మరమ్మతు లేక కాలువల ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు గాను నందగిరి, అయిత్‌పల్లి మినహా 21 గ్రామాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉండగా కాలువ నీరు వస్తేనే పంటలు పూర్తి స్థాయిలో పండేది. కాగా మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ కాలు వలను ఎన్నో ఏండ్ల కింద సిమెంట్ లైనింగ్ చేయగా అప్పటి నుంచి వాటి మరమ్మతు, పూడిక తీత పనులపై పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

దీంతో దాదాపు అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోవడమే కాకుండా సిమెంట్ లైనింగులు కూలిపోయి, తూముల షట్టర్లు ఊడిపోయి కాలువల ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు ఉంది. రెండవ పంటకు మరి కొద్ది రోజుల్లో నీరు వదిలే పరిస్థితులుండగా కాలువల మరమ్మతు పూడికతీత పిచ్చిమొక్కల తొలగింపునకు మాత్రం ఆ శాఖ అధికారులు దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలు వలలో పిచ్చి మొక్కలు పెరిగి ప్రధాన కాలువ నుంచి ఎన్ని నీళ్లు వదిలినా ప్రధాన కాలువకు సమీప ప్రాంతాల రైతుల పంట పొలాలకు మాత్రమే నీరు అందుతోంది. చివరి ఆయకట్టు రైతులు ఎప్పుడూ పంటలు ఎండబెట్టుకునే పరిస్థితులే ఉన్నాయంటూ వాపోతున్నారు.



పెగడపల్లి శివారులో కాలువలో నిండిన మట్టి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువల మరమ్మతులతో పాటు పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్
- సిరిసిల్లకు చేరుకున్న మాలల మహా పాద్రయాత్ర


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను మానుకోవాలని, వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. అక్టోబరు 25న భద్రాచలంలో ప్రారంభించిన మాలల మహా పాద యాత్ర మంగళవారం సిరిసిల్ల పట్టణానికి చేరకుంది. మాలమహానాడు జిల్లా, పట్టణ, మండలాల నాయకులు పాదయాత్ర చేస్తున్న పిల్లి సుధాకర్, నాయకులకు ఘన స్వాగతం పలికారు. స్థానిక రగుడు నుంచి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర సాగింది. అంబేద్కర్ విగ్రహానికి సుధాకర్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాలల మహా పాదయాత్రకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. మాదిగల కంచంలోని అన్నంను, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను గుంజుకుంటున్నామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంతో సంబంధం లేకుండా దొడ్డి దారిలో నరేంద్రమోదీ సుప్రీం కోర్టు ద్వారా రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే విధంగా వెసులబాటు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మనువాదుల చెరలోకి మందకృష్ణ మాదిగ చేరాడని ఆరోపించారు. దళితులను మనువాదులు హింసలకు, మహిళలపై దాడులకు గురిచేస్తుంటే మనువాదుల మోచేతుల నీళ్లు తాగుతున్న మందకృష్ణమాదిగకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని మాలలు మొత్తం కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం తిరగారన్నారు. మాలలను మరిచిపోయి ఒక కులానికి కొమ్ము కాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజు, జిల్లా నాయకులు రెంజర్ల రాజేష్, మేడి అంజయ్య, నాలుక సత్యం, జక్కుల యాదగిరి, రొడ్డ రాంచంద్రం, ఎడ్ల సందీప్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు



రోడ్డుమీదకు ఎక్కి నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సులు లేక భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తులు సోమవారం రాజన్నను దర్శించుకుని మంగళవారం బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు తీసి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రాజన్న భక్తులతో పాటుగా, ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో బస్టాండులో బస్సులు లేకపోవడంతో గంటలపాటు నిరీక్షించిన భక్తులు సహనాన్ని కోల్పోయి రోడ్డుపైకి వెళ్లి వచ్చే బస్సులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులకు నచ్చజెప్పి ఒప్పించారు. దీంతో ప్రయాణికులు శాంతించారు.

చిన్నబోతున్న పర్యాటకం

- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- కార్మిక, ఆధ్యాత్మిక క్షేత్రానికి.. పర్యాటక సొబగులు దూరమేనా?
- జిల్లాలో మిడ్‌మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల వద్ద ప్రతిపాదనలు
- అనంతగిరి ప్రాజెక్టులో 40 ఎకరాల్లో ఐలాండ్
- నేడు సిరిసిల్ల జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్మిక, ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తుంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా నేతల హామీలు, పరిశీలనలకే పరిమితమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు హడావుడిగా బోటు ప్రారంభించి జల విహారానికి నాంది పలికగా ప్రారంభోత్సవంతోనే నిలిచి పోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురు చూసినా నిరాశే మిగిలింది. ప్రారంభించిన బోట్లు ఇప్పటికీ కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్ట్ వద్ద పర్యాటక రంగంవైపు చూస్తారని ఆశగా ప్రజలు ఎదురుచూస్తున్నారు.


పర్యాటకానికి రెండు ప్రాజెక్టులు కీలకం...

జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. వేములవాడల శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు రెండు ప్రాజెక్టుల వద్ద పర్యాటక పరిశీలనలు జరిగాయి. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు కాటేజీల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే క్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావుడిగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మిడ్ మానేరులోని అందాలను చూసే విధంగా విహరించే అవకాశం అందుబాటులోకి వస్తుందని అనుకున్నా నిరాశే మిగిలింది.

ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...



ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్టును నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతి పెద్ద సర్జిపూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్టులో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు. జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ప్రతీయేడు లక్షల సంఖ్యలో వచ్చిపోతుంటారు. మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్టులను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గత ప్రభుత్వం భావించింది. మిడ్ మానేరు ప్రాజెక్ట్ వద్ద బోటింగ్‌తో పాటు అడ్వెంచర్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక అభివృద్ధికి బాటలు వేయాలని ఈ ప్రాంతావాసులు కోరుకుంటున్నారు.


అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో బోటు

బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

భగత్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు బంద్ చేస్తే విద్యార్థుల చదువులు ఎలా సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం సరి కాదన్నారు. రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులురవి, రమేష్, రాజు, క్రాంతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖో-ఖో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 24న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9:30 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా ఖో- ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9:30 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో ఒరిజినల్ ఆధార్ కార్డు, అలాగే ఒక జిరాక్స్, ఒక ఫొటోతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 21న లగచర్లకు వామపక్షనాయకులతో కలిసి వెళ్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సిరిసిల్ల నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం సీపీఐ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి పట్టణంలోని బీవైనగర్ షాదీఖానా వరకు ఎర్రజెండాలు చేతబూని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.


సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

అనంతరం జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టే పనులపై అఖిలపక్షం నాయకులతో చర్చలు జరపకుండా నియంతృత్వ ధోరణికి పాల్పడుతున్నారని అన్నారు. మూసీ నది ఒడ్డున ఉన్న ఇళ్లకు బదులుగా వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడంతోపాటు వారికి ప్రతీనెల 15 వేల రూపాయలను అందించి వారిని ఆదుకోవాలన్నారు.

గత ప్రభుత్వం ఫార్మాసిటికి హైదరాబాద్ శివారులో 13వేల ఎకరాలను తీసుకున్నారని అక్కడ దానిని నిర్మించకుండా సీఎం నియోజకవర్గంలోని లగచర్లలో 10వేల ఎకరాల భూములను తీసుకోవడం సరైందికాద న్నారు. ఇటీవల అ గ్రామానికి వెళ్లిన జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులపై దాడులు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారిని అరెస్ట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులను వదిలివేయడం సరైంది కాదన్నారు. పోలీసులు లగచర్ల గ్రామానికి ఎవరి రానీయకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ నెల 21వ తేదీన వామపక్షాల పార్టీ నాయకులతో తాను లగచర్ల గ్రామానికి వెళ్లి అక్కడి రైతులు, ప్రజలతో మాట్లాతానని మమ్ములను ఎవరు అడ్డుకుంటురో చూ స్తామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమం బలహీనంగా ఉన్నప్పటికీ బలమైన పోరాటం నిర్మించిందని అన్నారు.



సిరిసిల్లలో సీపీఎం ర్యాలీ

ముఖ్యమంత్రి బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి నేతన్నలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వ అర్డర్లను ప్రకటించి తన చిత్తశుద్ధిని ప్రదర్శించాలనిన్నారు. కేంద్రంలోని బీజేపీ హిందుత్వ సిద్ధాంతం కేవలం అదానీ, అంబానీ వం టి అగ్రవర్ణాల ప్రయోజనాల కోసమని అసలైన హిందువులకు మేలు జరగదని వివరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, కూరపాటి రమేష్, జిల్లా కార్యదర్శి మూషం రమేష్, నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, విమల, గన్నేరం నర్సయ్య, మల్లారపు అరుణ్‌కుమార్, ఎరవెల్లి నాగరాజుపాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. మహిళ భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ అంజన్నను దర్శించుకున్నారు. కొండపైన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.


కొండగట్టు ఆలయం వద్ద భక్తులు

● ధర్మపురిలో కార్తీక భక్తుల రద్దీ

- ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తుల రద్దీ మంగళవారం పెరిగింది. క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి, లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.


గోదావరి నది వద్ద హారతి పూజలు

● 18 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 18వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు లోక క్షేమం కోసం, విశ్వశాంతి కోసం విశేష పూజలు జరిపారు. నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

- కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు
- ఆకట్టుకున్న చిన్నారులు నృత్యాలు

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. రాజన్న ఆలయంలోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీరొక్కపూలతో పలు ఆకృతుల్లో అందంగా దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా నిజామాబాద్‌కు చెందిన సిద్ధార్థ కళాక్షేత్రం ఆంధ్ర నాట్యము జయలక్ష్మి బృందం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు దుమాల నాగరాజుశర్మ, వెంకటయ్య, కృపాల్ తదితరులు ఉన్నారు.


సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు


కార్తీక సామూహిక దీపోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

అర్హులు బీమా నమోదు చేయించుకోవాలి

జిల్లా లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ కోట మధుసూదన్

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరు బీమా నమోదు చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ కోట మధుసూదన్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి, బీమాయోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్య కలిగిన ప్రతి ఒక్కరు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుష్ప, వీవోఏ లత, బీసీ పాయింట్ నిర్వాహకురాలు సిద్దు, సతీష్‌రెడ్డి, మ హిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మల్లాపూర్, నవంబరు, 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాల్గొండ గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణం, హోమం వంటి తదితర కార్యక్రమాలు వేదపండితుడు రాజశేఖర్‌చారి వేదమంత్రోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యంలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించినంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.


వాల్గొండలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరుపుతున్న భక్తులు

న్యూస్ బాక్స్

సభ్యత్వ నమోదు ప్రారంభం

పెద్దపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరుతోపాటు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కొయ్యకాళ్ల కాల్చివేతతో నష్టం

రామగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వరి కోతల అనంతరం ఉండే కొయ్యకాళ్ల కాల్చివేతతో రైతులకు నష్టం ఏర్పాడుతుందని ఏవో శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్వచర్లలో క్షేత్రస్థాయిలో పర్యటించి కొయ్యకాళ్ల వల్ల కలిగే లాభాలు, నష్టలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో అరవింద్, రైతులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై గ్రామసభ

రామగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరులో ఈజీఎస్‌పై మంగళవారం గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో చేపట్టబోయే పనులపై ఎంపీడీవో శైలజారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి చేపట్టే పనులను గుర్తించారు. ఏపీడీ సత్యనారాయణ, జీఎం స్పెషల్ ఆఫీసర్ రమేశ్, ఎంపీవో ఉమేష్, ఈసీ లక్ష్మణ్, పీఎస్ ప్రేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి వీడియో కాన్ఫరెన్స్

ఎలిగేడు, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వరి ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన పలు విషయాలపై సూచనలు చేస్తూ స్పష్టతను ఇచ్చారు. సన్నవడ్ల బోనస్, రైతుల ఖాతాలో జమచేయడం గురించి మాట్లాడారు. పాల్గొన్న రైతులు బండ రమేష్, మండల రవి, నరహరి నారాయణరెడ్డిలు ప్రభుత్వం అందిస్తున్న సన్నవడ్ల బోనస్ రూ.500 తమ ఖాతాలో జమైనట్లు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి దోమ ఆదిరెడ్డి, డిసివో శ్రీమాల, డిఎం శ్రీకాంత్, ఎడిఎ శ్రీనాథ్, ఏవో ఉమాపతి, పిఎసిఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఏఈవోలు సురేష్, గణేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

వాగు పరిశీలన

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగారంలో మంగళవారం హుస్సేన్‌మియావాగును మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనవేన సదయ్య, మాజీ సర్పంచ్ ఈద సత్యనారాయణరెడ్డి, రైతులు అంబాల రాజేందర్, కుసా సతీష్, యాట తిరుపతి తదితరులు ఉన్నారు.

సీఎం సభకు తరలివెళ్లిన స్వశక్తి మహిళలు

ఎలిగేడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 12 గ్రామాల్లోని స్వశక్తి మహిళలు మంగళవారం హన్మకొండలో జరిగిన ప్రజావిజయోత్సవ సభకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభకు తరలివెళ్లారు. వెంట ఐకేపీ ఏపీఎం సుధాకర్, సీసీలు జ్యోతి, మల్లేశ్, ఆనంద్, వీవోఏ, వీవో అధ్యక్షుడు తదితరులు ఉన్నారు.

● కోల్‌సిటీ (ఆంధ్రజ్యోతి): హన్మకొండలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభకు రామగుండం నుంచి స్వశక్తి మహిళలు తరలివెళ్లారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద మేయర్ బంగి అనీల్ కుమార్ సభకు వెళ్లే బస్సులకు జెండా ఊపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, పీఆర్‌పీలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు వీధి దీపాలు సమకూర్చిన ఆర్‌ఎఫ్‌సీఎల్

కోల్‌సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సెంట్రల్ లైటింగ్ వీధి దీపాలు సమకూర్చాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తికి ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించింది. రూ.16లక్షల విలువైన వీధి దీపాలను సమకూర్చింది. మంగళవారం ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్ ప్రదీప్ వర్న్ రూ.11.55లక్షల విలువగల 90వాట్ల 340 ఎల్‌ఈడీలైట్లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేషనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రాంజీ, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా తదితరులకు అందజేశారు. ఆగస్టు 27న రూ.5లక్షల విలువగల 150 వీధి దీపాలను ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మున్సిపల్ కార్పొరేషన్‌కు అందించింది. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఎండీ శర్వానన్ వీధి దీపాలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. దీంతో మరో రూ.11.55లక్షలతో కొనుగోలుచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరిశ్రమల సహకారం తీసుకుంటున్నారన్నారు. కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు లేక చీకట్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో వీధి దీపాలు సమకూర్చాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యాన్ని కోరారన్నారు. ఈ మేరకు ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం విడుతల వారీగా సుమారు 500లైట్లను సమకూర్చిందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలు కూడా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఎన్‌టీపీసీ నుంచి గౌతమినగర్ వరకు వీధి దీపాలు లేక ఇబ్బందులు ఎదురవుతుండగా టీయూఎఫ్ఐడీసీ నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే అవి అందుబాటులోకి వస్తాయన్నారు. విపక్షాలు జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారికి అభివృద్ధితోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాల శ్రీనివాసరావు, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్, నాయిని ఓదెలు, గట్ల రమేష్, సాంబమూర్తి, దూళికట్ట సతీష్, దాసరి విజయ్, కళ్యాణి సింహాచలం పాల్గొన్నారు.



కార్పొరేషన్ అధికారులకు ఎల్‌ఈడీ లైట్లు అందజేస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ జీఎం ప్రదీప్

పేదరికాన్ని రూపుమాపిన ఇందిరాగాంధీ

- రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్

కళ్యాణ్‌నగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో పేదరికాన్ని, అసమానతలను రూపుమాపిన నాయకురాలు దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని మేయర్ బంగి అనీల్ కుమార్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గాంధీనగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్, కాల్వ లింగస్వామి, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మంగళవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, సాగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఆర్జీ-2 ఐఎన్‌టీయూసీ ఆఫీస్‌లో వైస్‌ప్రెసిడెంట్ కొత్త సత్యనారాణరెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● పెద్దపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జయంతిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంగళవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణ వేణి సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. పెద్దపల్లి మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ధర్మారంలో నివాళులర్పిస్తున్న నాయకులు

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సయ్యద్ అన్వర్, మల్యాల తిరుపతి, అబ్దుల్ రఫీక్ తదితరులు ఉన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. దుగ్యాల సంతోష్‌రావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేశనపల్లిలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. బియ్యని శివకుమార్, తూటిరపే తదితరులు పాల్గొన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మడకలో ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య, అధికార ప్రతినిధి గోసిక రాజేశం, పేరవేణి రవి తదితరులు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్యా రూప్లానాయక్, గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కాడె సూర్యనారాయణ తదిత రులు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు చిలక సతీష్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, పాన్నాల రాములు తదితరులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు, స్వీట్లు పంపిణీ చేశారు. సాయిరి మహేందర్, మేకల పోచం, కల్లెపల్లి జానీ, తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజలకు సీపీఎం అండ

జ్యోతినగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పీడిత ప్రజలకు సీపీఐ(ఎం) దశాబ్దాల కాలంగా అండగా ఉంటున్నదని, భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.యాకయ్య పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో యాకయ్య మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, పేద ప్రజల హక్కుల కోసం సీపీఎం రాజీలేని పోరాటాలను చేస్తున్నదన్నారు. ప్రజల భాగస్వామ్యంతో రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో ఎన్టీపీసీలో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గత 3 ఏళ్లలో సీపీఎం చేసిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై రెండు రోజుల మహాసభలో చర్చిస్తామని యాకయ్య చెప్పారు. గత కొన్నేళ్లుగా కార్మికులకు 26 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని సీపీఎం డిమాండ్ చేస్తున్నదన్నారు. ఎన్నికల సమయంలో 26వేల కనీస వేతనం ఇప్పిస్తామని హామీలిచ్చిన పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత హామీని విస్మరిస్తున్నాయని విమర్శించారు. మహాసభలలో ఇదే అంశాన్ని ప్రధాన ఎజెండా తీసుకుని చర్చిస్తామని తెలిపారు. సభలకు సీపీఎం రాష్ట్ర నేత ఎస్.వీరయ్య, జ్యోతి తదితరులు హాజరౌతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు నాంసాని శంకర్, రామాచారి, ఎన్.బిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, ముత్యంరావు, భూపాల్ పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

కోల్‌సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మార్కండేయకాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ యాంటీ నర్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)చే గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు టీజీ న్యాబ్ డీఎస్పీ ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజం నుంచి గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను పారద్రోలాలని, ఇందుకు విద్యార్థులు,యువత బాధ్యత తీసుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడవద్దని, జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వాడకంపై ఏ సమాచారం ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సదస్సులో గోదావరిఖని ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, టీజీ న్యాబ్ సీఐ కృష్ణమూర్తి, గోదావరిఖనిలోని పలు కళాశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా సమగ్ర సర్వే..

(5వ పేజీ తరువాయి)

సర్వే పూర్తి చేశారు. జిల్లాలో ఈనెల 9వ తేదీన ప్రారంభించారు. 8 పేజీల్లో దాదాపు 72 అంశాల్లో ఈ సర్వే చేస్తున్నారు. కుల గణనతో పాటు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వే చేస్తున్నారు. ఈ సర్వే ద్వారా ఆయా కుటుంబాల్లో ఉండే కుటుంబ సభ్యుల స్థితిగతులు అన్ని ఉన్నాయి. మతం, సామాజిక వర్గం, కులం పేరు చెప్పడం, ఆధార్ నంబర్లు ఇవ్వడం, సెల్ ఫోన్ నంబర్లు ఇవ్వడం ఐశ్చికమేనని, ఈ విషయంలో ఎవరిని ఇబ్బందులకు గురి చేయవద్దని ప్రభుత్వం సర్వే చేసే అధికారులు, సిబ్బందికి సూచించారు. అలాగే ఆస్తులు, భూముల వివరాలు చెప్పినవే రాసుకోవాలని సూచించారు. ఆ మేరకు సిబ్బంది సర్వేను జిల్లాలో వేగంగా నిర్వహిస్తున్నారు.

రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

రామగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. మండలంలోని కల్వచర్లలో ఐకేపీ సెంటర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం అయ్యారు. రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తొలిసారిగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్‌ను తహసీల్దార్ రాంచందర్‌రావు, డిటి మానస, సిబ్బంది శాలువాతో సత్కారించారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ వేణు సందర్శించారు. ఇక్కడ కొనుగోలు కేంద్రంలో విక్రయానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీంచారు. కొనుగోళ్ల నిర్వహణ తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ వాసంతి ఉన్నారు.

రైతుల మేలు కోరి బోనస్ చెల్లింపులు

మంథని, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల మేలు కోరే రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 5 వందలను బోనస్‌గా చెల్లిస్తుందని పీఏసీఎస్ చైర్మన్‌కొత్త శ్రీనివాస్ వెల్లడించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని మల్లెపల్లి, సిరిపురం, గుంజపడుగు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో నేతలు పేరవేన లింగయ్యయాదవ్, ముస్కుల సురేందర్‌రెడ్డి, డైరెక్టర్లు దేవళ్ళ విజయ్‌కుమార్, ప్రభాకర్, లక్ష్మి, మాధవి, ఓదెలు, పోచంలు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

సుల్తానాబాద్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థి ఎం సంప్రీత్ హైదరాబాద్ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన యూత్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్, కృష్ణప్రియ విద్యార్థికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీష్ పాల్గొన్నారు.

మెప్పు కోసమే అసత్య ఆరోపణలు

కళ్యాణ్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొంత మంది కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే మెప్పు కోసమే ఇలా చేస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు గాదం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాటాడారు. చందర్ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, అప్పటి నిధులతోనే ఇప్పటి పనులు అవుతున్నాయని చెప్పారు. కొంత మంది నాయకులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మెప్పు కోసం తహతహలాడుతున్నారని, ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారని, నాయకుల జోకుడు విధానాన్ని మార్చుకోవాలన్నారు. బాదె అంజలి, సంధ్య, స్వప్న, సట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌ను తాత్కాలికంగా తరలించాలి

మంథని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కూరగాయ మార్కెట్ యార్డును తాత్కాలికంగా తరలించడానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులకు సూచించారు. ఈమేరకు కలెక్టరేట్‌లో అదనపు అరుణశ్రీతో కలిసి మంథని మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై మంగళవారం కలెక్టర్ శ్రీహర్ష సమీ క్షించారు. ప్రస్తుతం మార్కెట్ ఉన్న స్థలంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉండటంతో మార్కెట్‌ను తాత్కాలికంగా తరలించడానికి చర్యలు చేపట్టాలన్నారు. మంథని మున్సిపల్‌లో మురికి కాల్వను ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలని, పారిశుధ్య విధులను శ్రద్ధతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్ర మంలో పీఆర్ ఈఈ గిరీష్‌బాబు, జెడ్పీ సీఈవో నరేందర్, మున్సిపల్ కమీషనర్ మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర



గుట్టపైకి వెళ్లే దారిలో స్వాగత తోరణం

పెద్దపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం(జాతర) నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకర్ తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పోలీస్ అధికారులు మూడు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. పెద్దపల్లి నుంచి వచ్చేవారికి అందుగులపల్లి శివారులో, రంగాపూర్, మంథని నుంచి వచ్చేవారికి రాఘవపూర్ శివారులో, బసంత్‌నగర్, గోదావరిఖని నుంచి వచ్చేవారికి నాగులమ్మగుడి సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..

- ముద్దసాని శంకర్, ఆలయ ఈవో

దేవునిపల్లి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బసంత్‌నగర్ పోలీస్ ఆధ్వర్యంలో 200మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

మాజీ మంత్రిని కలిసిన మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

ధర్మారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఎన్నిక కాబడిన ధర్మారం మండల మున్నూరు కాపు సంఘ మండల అధ్యక్షుడు తన్నీరు రాజేందర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొప్పుల వారిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొత్త మోహన్, కోశాధికారి ఆడవాల రవి, ఉపాధ్యాక్షులు శ్రావన్ కుమార్, సాన రాజేందర్, దీటి శ్రీనివాస్, కుంటురు ప్రతాప్, మిట్ట తిరుపతి, రాసూరి శ్రీధర్, లైశెట్టి సత్యం, ఎగ్గెల స్వామి, కొమురయ్య, కుమ్మరికుంట సంతోష్, ఆవుల మల్లేశం, సాయిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి చేయూతనందించాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సహకరించాలి - ఆలయ ట్రస్ట్ సభ్యులు

జ్యోతినగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో తాము తలపెట్టిన గుడి నిర్మాణానికి అన్నివర్గాల వారు చేయూతనం దించాలని శివ కేశవ ఆలయ ట్రస్ట్ సభ్యులు పి.మధుసూదన్‌రెడ్డి, ఎస్.సాగర్‌రావు, మీనేశ్ టాండన్, సిహెచ్.వెంకట్‌రెడ్డి, చతురుభజ దేవడా, రామక్రిష్ణారెడ్డి కోరారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాటాడుతూ ట్రస్ట్ సొంత స్థలంలో హనుమాన్ దేవాలయాన్ని నిర్మిస్తుంటే పక్కన ఉన్న భూయజమాని అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. శివ కేశవ ట్రస్ట్ పేరుతో 2003లో కృష్ణానగర్‌లో 3 గుంటల భూమిని కొనుగోలు చేశామని, ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఏ ఒక్క ఇల్లు కూడా లేదన్నారు. తాము భూమి కొన్న తరువాతనే శ్రీనివాస్ అనే వ్యక్తి గుడి స్థలం పక్కన స్థలాన్ని కొనుగోలు చేశాడని, మిగతావారు ఇళ్లను నిర్మించారన్నారు. ట్రస్ట్ స్థలంలో గత 20 ఏళ్లుగా వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రోత్సవాలు, శ్రీరామనవమి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సహకారాన్ని అందించాలని వారు కోరారు.

ఈ సమావేశంలో దశరథం, శ్యాంసుందర్, చంద్రాగౌడ్, శరత్, నర్సింగరావు, సత్యవతి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.



వార్షిక లక్ష్యాలను సాధించాలి



ఆర్జీ-2 అధికారులతో చర్చిస్తున్న జీఎం సుభాని

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని జీఎం(కో ఆర్డినేటర్) సుభాని ఆర్జీ-2 అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్జీ-2 ఉత్పత్తి, రవాణా, ఉత్పత్తి పెంపుదలపై జీఎం వెంకటయ్యతో కలసి సమీక్షించారు. అన్ని విభాగాలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణాలో వేగం పెంచాల్సిన అవసరం ఉన్నదని సుభాని అన్నారు. వీకేపీ గని, ఓసీపీ-3 ప్రాజెక్టుకు కేటాయించిన రోజువారి లక్ష్యాలను సాధించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టు ప్రతినిధులు, ఓబీ కాంట్రాక్టుతో మాట్లాడి వీలైనంత త్వరగా బొగ్గు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓబీ కాంట్రాక్టు సైతం రోజువారి లక్షాల ప్రకారం ఓబీ వెలికితీసేలా దృష్టి సారించాలని జీఎం సుభాని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం రాముడు, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈ) మురళీకృష్ణ, డీజీఎం(ఫైనాన్స్) వెంకటరామచంద్ర, డీజీఎం(సివిల్) ధనుంజయ, అధికారులు బూక్యదేశాయి, సునీత, షరీఫ్ మహమ్మద్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓసీపీ-3లో నల్లబ్యాడ్జీలతో ఆపరేటర్ల నిరసన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమోషన్లు ఇవ్వడంలో యాజమాన్యం జాప్యం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఓసీపీ-3లో ఆపరేటర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు. డీ గ్రేడ్ ఆపరేటర్లమైన తమకు 2021లో సీ గ్రేడ్ ఆపరేటర్లుగా ప్రమోషన్లు రావాల్సి ఉన్నదని, నాలుగేళ్ళుగా ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో అన్ని విధాల నష్టపోతున్నట్టు ఆపరేటర్లు తెలిపారు. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. తమ తర్వాత ఆపరేటర్లుగా రిక్రూట్ అయిన ఆపరేటర్లు సీ గ్రేడ్ పదోన్నతి లభించినా, రామగుండం రీజియన్ ఆపరేటర్లకు మాత్రం ఇప్పటి వరకు ప్రమోషన్లు ఇవ్వలేదని అన్నారు. సింగరేణి చరిత్రలో ఏళ్ళ తరబడి ప్రమోషన్ల ఆలస్యం జరిగిన దాఖలాలు లేవన్నారు. గతంలో ప్రమోషన్లు ఆలయమయిన సందర్భాల్లో బ్యాక్ డేట్‌తో ప్రమోషన్లు ఇచ్చిన ఆనవాయితీ ఉన్నదని ఆపరేటర్లు పేర్కొన్నారు. డీ గ్రేడ్ ఆపరేటర్లక సీ గ్రేడ్ ప్రమోషన్లు ఇప్పించడంలో గుర్తింపు సంఘం చొరవ చూపాలని కోరారు. ఈనెలలో జరగనున్న స్ట్రక్చర్ సమావేశాల్లో 2021 నాటిని పరిగణనలోకి తీసుకుని సీ గ్రేడ్ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనిరసనలో మల్లేష్, తిరుపతిరెడ్డి, గుర్రం రవి, సదానందం, విజయ్‌కుమార్, రాకం రమేష్, శ్రీహరి, రాజశేఖరెడ్డి, మహిపతి, రమేష్, మల్లేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆపరేటర్లు

మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలోని వివిధ విభాగాల మహిళా ఉద్యోగినలకు మంగళవారం యాజమాన్యం కౌన్సెలింగ్ నిర్వహించింది. ఓసీపీ-3 స్టోర్స్, సీహెచ్‌పీ, మేనేజర్ కార్యాలయం, పీఓ ఆఫీస్‌లలో పనిచేస్తున్న బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్‌లకు సర్ఫేస్‌లో 16 డిసిగ్నేషన్‌లలో ఉద్యోగాల గురించి కమిటీ కన్వీనర్ ఎస్వోటూ జీఎం రాముడు వివరించారు. కౌన్సెలింగ్‌కు 19 మంది హాజరయ్యారు. ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ అందించిన తర్వాత సంబంధిత ఉద్యోగాలకు పంపడం జరుగుతుందని ఎస్వోటూ జీఎం రాముడు పేర్కొన్నారు. చేస్తున్న పనిలో నైపుణ్యత పెంపొందించుకుంటూ నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కౌన్సెలింగ్‌లో డీజీఎం (ఐఈ) మురళీకృష్ణ, అనిల్‌కుమార్, డీజీ ఎం పర్సనల్ అనిల్‌కుమార్, మేనేజర్ భరత్‌కుమార్, సేఫ్టీ ఆఫీసర్ పాపయ్య పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

సుల్తానాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ సుల్తానాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. కరీంనగర్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ రాసురి ప్రవీణ్, వివేకానంద కళాశాల చైర్మన్ రవీందర్, ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ రిషి, వినయ్, సిద్ధార్థ, అభిషేక్, అనిల్, కుమార్ పాల్గొన్నారు.

● ధర్మారం(ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ ధర్మారం నగర శాఖ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి ఆకుల వంశీ, ఉపాధ్యక్షులు జస్వంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఝాన్సీరానీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు సందనవేని ఓమేష్, అకిల్,హరిష్, వినయ్, పూజిత, మానస, రజిత పాల్గొన్నారు.

కేశోరాంలో కొనసాగుతున్న నిరసనలు

పాలకుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారంలో కార్మికుల నిరసన సెగలు రోజుకో విధంగా కొనసాగుతున్నాయి. దీపావళి బోనస్ రూ.52 వేలు చెలించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. ఇప్పటికైనా బోనస్ విషయంలో ఇక్కడి అధికారులు కంపెనీ ఉన్నతాధికారులతో వెంటనే చర్చించి కార్మికులకు మెరుగైన బోనస్ అందించాలని లేకుంటే బుధవారం టూల్ డౌన్ చేసి సమ్మెకు వెళ్లనున్నట్లు వారు తెలిపారు.

డిప్యూటీ మేయర్‌పై అసత్య ఆరోపణలు

జ్యోతినగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావుపై కాంగ్రెస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ జ్యోతినగర్ అధ్యక్షుడు బుర్ర శంకర్‌గౌడ్, కార్పొరేటర్లు ఎన్.వి.రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి అన్నారు. మంగళవారం విలేకరుల సవవేశంలో వారు మాట్లాడారు. డిప్యూటీ మేయర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటామన్నారు. ఈదునూరి శంకర్, పర్వతాలు, రాంపెల్లి శ్రీనివాస్, సంధ్యారెడ్డి, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

పాలకుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు మానుకోవాలని డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య అన్నారు. ఈ మేరకు ఆయన పుట్ట మధు, చల్లా నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బసం త్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం సమ్మయ్య పాత్రికేయులతో మాట్లాడారు. సమావేశంలో తలారి శంకర్, వేల్పుల రాజ్‌కుమార్, అర్కల సతీష్, బాలగోని కుమార్ తదితరులు పాల్గొన్నారు.